

# టేకిట్ ఈజీ!! - 3

శ్రీనివాస ఫణికుమార్ డొక్కా





## -12-

## సిత్రాలు సూడరో...(రెండవ భాగం)

## గుడి లో గుట్టు

కలిపురుషుడు కాఫీ తాగేసి లేచి నించున్నాడు. గోపాలొచ్చి కప్పు అందుకున్నాడు. కలిపురుషుడు ముందుకు వంగి, గోపాల్ చొక్కా లాగి, పైకెత్తి, దాంతో మూతి తుడుచుకుని "ఆ,వస్తానయ్యా.అమ్మాయినీ పిల్లల్నీ అడిగినట్లు చెప్పు". అనేసి వెనక్కి తిరిగాడు.

"అదేటి, ఇంకో కథ చెబుతానన్నారు? " అన్నాడు గోపాల్, స్వర్ణ కమలం లో భానుప్రియలాగ.

"ఓ, అలా అన్నానా, ఐతే పద అలా వాకింగ్ చేస్తూ మాటాడుకుందాం" అనేసి బైటికొచ్చేసాడు.

వెనకాలే గోపాలు ఫాలో అయ్యాడు, కాఫీ మరకల చొక్కా కేసి దీనంగా చూసుకుంటూ.

"ఆ, మీరు చేసే రెండో తప్పు గురించి చెబుతా అన్నా కదూ. అక్కడికే వస్తున్నా. అనగా అనగా ఒక సురేషు. ఆడి కథ చూడు." అనేసి ఓ మాటు గోపాలు కళ్ళు టచ్ చేసాడు. అంతే గోపాలుకి బొమ్మ కనబడ్డం మొదలెట్టింది...

"డియర్ ఎంకటేశ్, దిస్ థర్స్ డే ప్లీజ్ కం ఫర్ హారతి అండ్ ప్రసాద్.." ఈ ఈ మెయిల్ ని ఇప్పటి పది సార్లు చదివాడు ఎంకటేశ్. డీకోడ్ చేద్దావని ప్రయత్నిస్తున్నాడు. హారతి అనేది పుంలింగం కాదు. స్త్రీలింగం అయితే బావుణ్ణు. మరి ప్రసాద్ అంటే? వాళ్ళ ఆయన పేరా? అర్థం కాలేదు. ఎందుకేనా మంచిదని ఫోన్ చేసి అడిగాడు సురేష్ ని. అప్పుడు బోధపడింది.

**(చట్టబద్ధమైన హెచ్చరిక: "ప్రసాద్" కి రమ్మని పిలిచిన వాళ్ళెవ్వరూ భోయనాలు పెట్టరు. ఇది అనుభవమ్మీద తెలుసుకోవాల్సిన విషయం. మీకు ఇనిస్టెంటుపులిహోర(అనగా, దిక్కుమాలిన పొడి కలిపినది అని భావము), వెయ్యి మిరియాల్లో వంద అన్నం మెతుకులు వేసిన చల్లారిపోయి, పిష్ఠం అయిపోయిన (ఇ)క్కట్టు పొంగలీ నచ్చకపోతే, "ప్రసాద్" పార్టీలకి వెళ్ళేముందే సుబ్బరంగా తినేసి వెళ్ళండి. వెధవ కక్కుర్తి మానండి, ఎందుకు చెబుతున్నానో అర్థం చేసుకోండి.)**

"ఎటూ కాకుండా గురువారం హారతేవిటీ, హాయిగా ఏ సుక్కురారం రాత్రో, శనివారం రాత్రో పెట్టుకోరా, ప్రసాదం తో పాటు తీర్థం కూడా పుచ్చుకోవచ్చు" అని ఎంతో చెప్పి చూసాడు ఎంకటేశ్. సురేష్ గాడు వినలేదు.

"ససేమిరా" అన్నాడు. అంటే ఏంటన్నాడు ఎంకటేశ్.

"ససేమిరా అంటే ఏంటో నాకూ తెలీదు" అన్నాడు సురేష్ సాలోచనగా.

"మరెందుకన్నావు?" అన్నాడు ఎంకటేశ్.

"ససేమిరా" అన్నాడు సురేష్. ఫోను పెట్టేసి, విధిలేక గురువారం ఏడున్నరకి సురేషింట్లో హాజరయ్యాడు ఎంకటేశ్.

అప్పటికే ఓ పన్నెండుమంది కూర్చుని ఏవో లెక్కలేసుకుంటున్నారు. ఎంకటేశ్ రాగానే పద్దుల పుస్తకం పక్కనెట్టి, "దా, నీకోసమే వెయిటింగ్. ఒక్క ఫైవ్ మినిట్స్ లో హారతి మొదలెడదాం.." అనేసి నిల్చున్నారు.

ఒక పిల్లాడొచ్చి "అంకుల్ ఈ లిష్టులో మీ ఈ మెయిల్ రాయండి" అనేసి కాయితం, పెన్నూ ఇచ్చాడు. రాసాడు ఎంకటేశ్. ఆనక పాళీ భాషలో ఆరతి జరిగింది. బిక్కు బిక్కు మని చూస్తున్నాడు ఎంకటేశ్. అందరూ సీజండ్ ఆర్టిష్టుల్లా రెచ్చిపోయి పాడేసారు ఆరతి. అవ్వగానే ఎదురుగ్గా "లేటెస్ట్ వారానంద బాబా" ఫొటో కి హారతి ఇచ్చి, ఆనక అందరూ కాయితం ప్లేట్లల్లో చల్లారిపోయిన పులిహోర, కారం పొంగలి తిన్నారు.

"మనం ఇలా ప్రతీ వారం చెయ్యాలి. సీక్రెట్టేవిటంటే, నేను లాస్ట్ వీక్ నాలుగు ఇళ్ళు అమ్మాను. మంచి ప్రాఫిట్స్ వచ్చాయి. అంతా "లేటెష్ట్ వారానంద బాబా" గారి దయ. నాకు నిద్దట్లో మెసేజ్ ఇచ్చారు. అందుకని నా ప్రయత్నంగా మొదలెట్టాను. ఇదిగో వీళ్ళంతా మన టీము" అని అందర్నీ చూపించాడు రియాల్టర్ సురేష్. ఓ వెర్రి నవ్వు నవ్వేసి వచ్చేసాడు ఎంకటేశ్.

అలా మొదలైంది. ఒక ఏడాదికి సురేష్ లివింగ్ రూం నించి గరాజ్ లోకి ప్రమోట్ అయ్యారు "లేటెష్ట్ వారానంద బాబా" గారు. సురేష్ వాళ్ళ కార్లు రెండూ పక్క వాళ్ళ డ్రైవ్ వే లో పెట్టుకున్నారు. అలా పెట్టుకోనిస్తే బోల్డు పుణ్యం, ప్లస్ లే.వా.బా గారి దయవల్ల స్టాక్ మార్కెట్లో ప్రాఫిట్స్ వస్తాయనే దురాశతో ఒప్పేసుకున్నారు పక్కింటి వాళ్ళు. సురేష్ డ్రైవ్ వే నిండా పద్మాలు, శంఖాలు, చక్రాల ముగ్గులు. గరాజ్ గోడలమీద బొమ్మల్లో ఓంకారంతో అల్లుకున్న శిలువ,దానిమీద చుక్కతో చందమామ, త్రిశూలాలూ, శివలింగాలూ, నాగు పాములూ,అమ్మవారి కళ్ళూ, కుతుబ్మీనారూ, చర్చి గంటలూ, ఇలా ఎన్నో ఎడిషన్స్ వచ్చి చేరాయి. ఈమెయిల్ లిస్టు ఇరవైనించి, ఇరవై పదుల దాకా పెరిగింది. లే.వా.బా గారికి సైడు లో మెరిసిపోయే హుండీ వెలిసింది. అందరూ చూస్తూండగానే సురేష్ వెళ్ళి ఓ వెయ్యి డాలర్లు హుండీలో వేసాడు. ఆనక అందరూ పోటీ పడి వేసేసారు. మినిమం దక్షిణ యాభై ఒకటిపలికింది. ఆరోజు ఇండియానించి ఎవర్నో తెల్లగెడ్డం సాధూబాబా ని తెప్పించారు. ఆయన ఇటికలూ గట్రా పెట్టి మధ్యలో పెద్ద మంట వేసి, గుగ్గిలం వేసి, నెయ్యి పోస్తూ ఏదో గెట్టిగా చదువుతున్నారు. ఏ మైసూరుపాకవో చేస్తున్నారు, పాపం గిన్నె పెట్టడం మర్చిపోయారు కాబోలనుకుని ఇంట్లోకెళ్ళి ఓ పెద్ద డేగిసా తెచ్చి ఆయనకి ఇచ్చాడు ఎంకటేశ్. ఆయన పన్నెండు కళ్ళు తెరిచి చూశాడు ఎంకటేశ్ ని. సురేష్ వచ్చి ఎంకటేశ్ ని పక్కకి లాక్కెళ్ళి

"ఒరేయ్, ఆయన వంట చెయ్యట్లేదురా, యజ్ఞం చేస్తున్నారు". అన్నాడు.

"యజ్ఞవా? ఇప్పుడేం యజ్ఞం రా ఎటూకాని వేళా" అన్నాడు ఎంకటేశ్ అనుమానంగా.

"ప్రదోష దోష హర భం భం" యజ్ఞం." అన్నాడు సురేష్.

"అలాక్కాదు గానీ ఇంకోమాట చెప్పు" అన్నాడు ఎంకటేశ్.

"ససేమిరా" అన్నాడు సురేష్.

మూసుకుని వెళ్ళి ఆఖరి వరసలో కూర్చున్నాడు ఎంకటేశ్. ఆరోజు భజన హాపింగ్, లంచ్ షాపింగ్, ఫ్లోటింగ్ భక్తులతో కలుపుకుని మొత్తం ఆరు ఏడు వందల మంది పాపులేషన్ లెక్కతేలారు. చాలామంది చెక్కులు రాసారు. పద్దుల పుస్తకం డిపాజిట్ల వివరాలతో నిండిపోయింది.

మరో మూణ్ణెల్లు గడిచాయి. ఈ మూడు నెలల్లో మూడు వెరైటీ యజ్ఞాల పుణ్యఫలంగా ఖర్చులుపోను ఓ లక్ష డాలర్లు పోగడ్డాయి. లే.వా.బా ట్రష్టు మొదలైంది. ఫౌండింగ్ పెద్దలంతా తలకో పదివేలు వేసుకుని ట్రష్టీలైపోయారు. ఎంకటేశ్ ని బలవంతం చేసారు, బలవంతంగా చేసేసారు, నెలకి వెయ్యి చొప్పున వాయిదా పద్ధతిలో కట్టేట్టు వాళ్ళే ఒప్పందం రాసేసి, ఎంకటేశ్ సంతకం పెట్టేసారు. ట్రష్టు డబ్బులతో మాంఛి డెవలపింగ్ సెంటర్లో రెండు రోడ్లని కలుపుతూ ఓ పదెకరాలు కొనేసారు, ఓ చిన్న ఇల్లుతో సహా. లే.వా.బా గారికి స్థాన

చలనమైంది. ఆయన మకాం ఆయింట్లోకి మార్చారు. ఆయనకి అరతి ఇవ్వడానికి ఒక భక్తుణ్ణీ, ప్రసాదం చెయ్యడానికి మరో భక్తుణ్ణీ వీసాలిప్పించి మరీ మన దేశం నించి ఇంపోర్ట్ చేసుకున్నారు. అక్కడ పదెకరాలూ చెట్లూ చేమతో గందరగోళంగా ఉంది. పుణ్యం డిపాజిట్టవుతుందనే ప్రతిపాదనమీదట శ్రమదానం చేసిపారేసారు భక్తులు. మొదట ఓ ఎకరం చదును చేసారు కారు పార్కింగులకోసం. ప్రాపర్టీ ఓనర్షిప్పు మనుషుల పేరు మీదా, మెయింటెనెన్సు, ఖర్చులూ గట్రా ట్రష్టు పేరుమీదా ఉండేట్టు జాగ్రత్త పడ్డారు పెద్దలు. ఇద్దరు ముగ్గురు జమాజెట్టీల్లాంటి సీ.పీ.యే లని నియమించుకున్నారు ఎటొచ్చి, ఎటొచ్చినా కాస్తారు అనే సదుద్దేశంతో.

అలా ఓ ఏడాది గడిచింది. తొలికాపు కోతకొచ్చేసమయం ఆసన్నమైంది. అనుకోకుండ ఒక నార్త్ ఇండియన్ పెద్దాయనకీ, తెలుగు కుటుంబాలొకరిద్దరికీ, కలలో ప్రేరణ లభించిందిట. వాళ్ళు గుడి మొదటి దశకి అయ్యే అయిదు మిలియన్లలో సహం ఖర్చు తామే భరిస్తామని, మిగితా సగం భక్తులు ఇస్తే సరేసరి, లేదా, తామే అంచెలంచెలుగా ఇచ్చేస్తామనీ బెదిరించడం వల్ల, భక్తులందరికీ తెగ సిగ్గేసేసిపోయింది. ఛీ, కనీసం మిగితా సగవన్నా ఇవ్వకపోతే, ఎందుకీ ఎదవ ఉజ్జోగాలూ, సంపాదనలూ, ఛీ..ఛీ..అసలు సంఘటన్ మే శక్తి హై, ఐకమత్యమే మహా బలము హై, హం పైసా దేతా హై.." అని నిర్ణయించేసుకున్నారు. భక్తులు తలుచుకోవాలే గానీ దేవుడు పరిగెత్తుకుంటూ రాడూ? వచ్చాడు. శంకుస్థాపన ముహూర్తానికి ఇద్దరు సౌతిండియా నించి, ఇద్దరు నార్త్ ఇండియా నించి పెద్ద పూజార్లు వచ్చారు. డోలు, సన్నాయి, గాడి పొయ్యిలు, వంట వాళ్ళు, టెంట్లు, హోమాలు, యజ్ఞాలు, డిస్కో లైట్లూ, ఫైర్ వర్క్సూ, మేయర్ గారి ఇనాగరల్ స్పీచీ..., అసలు కుమ్మేసారు. అసలు ఒక రకంగా లేదు, ఒకటో రకంగా వుంది. మూడు రోజుల పండగ సూపర్ డూపర్ హిట్టైపోయింది.

మరో యేడాదికల్లా పెద్ద గుడి, వంట శాల, పార్కింగు, పూజార్ల గదులు రెడీ అయ్యాయి. పన్నెండడుగుల లే.వా.బా గారి విగ్రహం తెప్పించారు. విగ్రహం పెట్టేచోట బంగారం వెయ్యాలన్నారు. సురేష్ ఆవేశం తట్టుకోలేక తన భార్య నగలూ, తన ఉంగరాలూ అన్నీ తీసేసి వేసేసాడు. భక్తులు ఆవేశంతో పరవశించి పోయి, అందరూ అలాగే తీసేసి, వంటిమీంచి వలిచేసి, అక్కడ వేసేసారు "జై" జై" అంటూ. ఎంకటేశ్ కి చిన్నప్పుడు వాళ్ళ తాత చెప్పిన "టోపీలమ్ముకునే తాత" కథ గుర్తొచ్చింది. బోలెడన్ని నాట్య భంగిమల్లో నించున్న దేవతా స్త్రీలని, సింపుల్ గా నమస్కారం పెట్టి నిల్చునే దేవతా పురుషుల్నీ చెక్కడం కోసం శిల్పుల్ని రప్పించారు. లే.వా.బా గారి జీవితాంశాలతో కాసిన్ని పెయింటింగులు గోడల మీద వెయ్యడానికి ట్రష్టీల పిల్లలకి ఆర్డరిచ్చారు. ఆయన గురించి ఎవరికీ ఏమీ తెలియదు గనక అన్ని మతాల్లోకీ ఆయన్ని ఎడాప్ట్ చేసేసుకుని అన్ని దేవుళ్ళ ఫేస్ కట్లలోనూ ఈయన రిఫ్లెక్ట్ అయ్యేట్లుగా బొమ్మలేసి చితగ్గొట్టేసారు. సెకండ్ ఫ్లోర్ లో ధ్యాన్ మందిర్ అవుర్ ప్రేయర్ హాల్ కట్టేసారు. గుడి మొదటి దశ పూర్తైంది. అక్కణ్ణించీ మహర్దశ మొదలై, పెద్దల దశ తిరిగింది. వారు ముట్టిందల్లా బంగారమైంది. అది తిరిగి వారికే ముట్టింది.

మరో ఆర్నెల్లకి పూజార్ల కుటుంబాలొచ్చి చేరాయి. వారికి పెర్మనెంట్ హౌసింగ్ ప్రాజెక్టు మొదలెట్టారు. భక్తులు పది రెట్లయ్యారు. పార్కింగ్ విస్తరణ ప్రాజెక్ట్, వీకెండు ఉచిత విస్తరి ప్రాజెక్టు,హోమశాల ప్రాజెక్ట్, పిల్లలు ఆడుకునేందుకు పార్కు, పెద్దవాళ్ళకి లైబ్రరీ, యూత్ కి బాస్కెట్ బాలు కోర్టు, బేస్ బాల్ ఫీల్డు ఇలా కనీసం ఒక యాభై ప్రాజెక్టులు, బ్రోచర్లూ రెడీ చేసారు. ట్రష్టీలలో తంపులు, సిగపట్లు మొదలయ్యాయి. ఎన్నికలద్వారా ఎజ్జిక్యూటివ్ కమిటీని నియమించడం మొదలైంది. వీళ్ళంతా విభీషణాయిల్లా ఇంటి గుట్టంతా బైటపెట్టేయకుండా ఉండేటందుకు కొంతమంది పెద్దలు మంత్రాంగాలు నడిపేవారు. గుడి నెలసరి ఆదాయం 50 వేలకి పైచిలుకే ఉంటోంది, ఖర్చులు పోను.

ఒక రోజు ట్రష్టీల మీటింగు లో పరిస్థితి చెయ్యి దాటి చెంపలమీద దాకా వెళ్ళింది. ఎవరిది ఏ బ్లడ్ గ్రూపో తెలుసుకోవాలనే కుతూహలంతో కొందరు అక్కడే రక్త పరీక్షలకి సిద్ధమయ్యారు. ఇంక లాభంలేదని పెద్దలంతా వచ్చి చేరారు. సుదీర్ఘంగా నాలుగు రోజులు ఆలోచించాల్సిన విషయాలుగా భావించి, ఒక రిసార్ట్లోని సెవెన్ స్టార్ హోటల్లో నాలుగురోజులు మీటింగులు పెట్టి, గుడికి మరో బ్రాంచ్

తెరవాలని, గొడవ చేస్తున్నవారంతా ఆ బ్రాంచికి ఫౌండింగ్ మెంబర్స్ ఆటోమేటిక్ గా అయిపోతారనీ, అయితే నెలకి పాతికవేల చొప్పున పదేళ్ళు పెద్ద గుడి ట్రష్టీలకి రాయల్టీ రాయితీ చెల్లించాలనీ తీర్మానించారు. మరో రోజు బెదిరింపుల తరువాత మొత్తానికి నెలకి పదిహేనువేల దగ్గర బేరం కుదిరింది. గొడవ బేచ్ కి పెద్ద గుడి వారు లోన్ శాంక్షన్ చేసారు, ధర్మ వడ్డీకి. ఆ ధర్మ సిరి తో ఈ మధ్యనే మరో పాతికెకరాలు కొన్నారు గొడవ బేచ్ వాళ్ళు. ప్రస్తుతానికి ఊరికి సౌత్ సైడు లొకేషను. అక్కడ ఓ చెట్టు నీడన లే.వా.బా గారి నల్లరాతి విగ్రహం నవ్వుతూ విశ్రాంతి తీసుకుంటోంది. సురేష్ ఆ చుట్టు పక్కల లేండ్స్ కొని సబ్డివిజన్లు కట్టే పథకంలో తలమునకలై బిజీ బిజీగా వున్నాడు. ఓ మంచి రోజు చూసి లే.వా.బా గారు గుళ్ళోంచి మాయమైపోయారు..."

గోపాలు కి బొమ్మ కనపడ్డం ఆగిపోయింది. "అమ్మ బాబోయ్. ఇదెక్కడ జరిగింది?" అన్నాడు అమాయకంగా. "ఇది బుధ గ్రహం మీద జరిగిందన్నమాట" అన్నాడు క.పు చిరాగ్గా మొహంపెట్టి. "హమ్మో, బుంగారక గ్రహం మీదా. అక్కడ మనుషులు ఇంత దారుణంగా ప్రతీదీ వ్యాపారం చేసేస్తారన్నమాట. ఇంకా నయం, మా భూమ్మీద మనుషులింకా మంచివాళ్ళు. ఇంత దారుణంగా లేరు." అన్నాడు బుంగమూతెట్టి.

"నిన్ను ఎవ్వడూ బాగుచెయ్యలేడు. ఇంతకీ ఇందాకా మీ ఇంట్లో టేబిల్ మీద ఏదో బ్రోచర్ చూసాను. ఎవరావిడ బ్రోచర్ మీద? " అన్నాడు క.పు. "ఎవరా? ఆవిడ ఎవరా? కళ్ళుపోతాయి. ఆవిడ పదహారు వేల గోపికలలో ఒక మాత. నెంబరు 15392. పేరు "ఝున్ ఝున్ గోపీ మా". ఆవిడ వ్రతం చేసుకుంటే ఎప్పటికోర్కెలు అప్పుడే తీరిపోతాయిట. ఆవిడ వ్రతం చేసుకోవడం కోసం మా ఇంటి పక్కన ఇరవై ఎకరాలు కొన్నారట ఝున్ ఝున్ సంస్థ వారు. మమ్మల్ని మెంబర్స్ గా చేరమని బ్రోచర్ పంపారు. చేరచ్చంటావా?" అడిగాడు గోపాలు.

"మీ ఖర్మ. మిమ్మల్ని బాగుచేయడం మిమ్మల్ని పుట్టించిన జేజెమ్మ తరం కాదు..." అనేసి మాయమైపోయాడు క.పు.

★★★★★★★★★★★★

Post your comments